## క్లుప్తంగా...

### అన్నదానం



అన్నదానం నిర్వహిస్తున్న డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని తదితరులు

**అబిడ్స్:** టీఎన్జీఓస్ హైదరాబాద్ జిల్లా అధ్యక్షుడు, అసద్అన్వర్ మెమోరియల్ వ్యవస్థాపకుడు డాక్టర్ ఎస్ఎం ముజీబ్ హుస్సేని ఆధ్వర్యంలో రెడ్‌హిల్స్ ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి వద్ద అన్నదానం నిర్వహించారు. దాదాపు 600 మంది రోగుల సహాయకులకు పౌష్టికాహారం అందజేశారు. ఈ సందర్భంగా ముజీబ్ హుస్సేని మాట్లాడుతూ.. నిరంతరం అన్నదాన కార్యక్రమాలు చేపట్టి సమాజ సేవకు కృషి చేస్తానన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా ఉద్యోగులు కేఆర్.రాజ్‌కుమార్, కుర్రాడి శ్రీనివాస్, ఖాలీద్, వైదిక్ శర్మ, ముఖీం ఖురేషి, ఖుతుబద్దీన్, ఐటీఐ సుధాకర్‌రెడ్డి, చాంద్‌పాషా, నాల్గవ తరగతి అసోసియేట్ అధ్యక్షుడు మొహమ్మద్ అబ్దుల్ ముజీబ్, ఎంఎన్‌జే కేన్సర్ ఆస్పత్రి సభ్యులు శివకుమార్, చంద్రశేఖర్, రామకృష్ణారెడ్డి పాల్గొన్నారు.

### కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలి

**గన్‌ఫౌండ్రీ:** తెలంగాణ రాష్ట్ర వ్యాప్తంగా అన్ని విశ్వవిద్యాలయాల్లో విధులు నిర్వహిస్తున్న కాంట్రాక్ట్ అసిస్టెంట్ ప్రొఫెసర్లను రెగ్యులర్ చేయాలని ఓయూ కాంట్రాక్ట్ టీచర్స్ జేఏసీ డిమాండ్ చేసింది. ఈ మేరకు శుక్రవారం ఓయూ కాంట్రాక్ట్ టీచర్ల జేఏసీ ఆధ్వర్యంలో బషీర్‌బాగ్‌లోని బీజేఆర్ విగ్రహం నుంచి అంబేడ్కర్ విగ్రహం వరకు కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జేఏసీ జేఏసీ డాక్టర్ పరశురామ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ డిగ్రీ, జూనియర్ కళాశాలలకు చెందిన కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేసిన ప్రభుత్వం తమను ఎందుకు విస్మరించారని ఆవేదన వ్యక్తం చేశారు. తక్షణమే విశ్వవిద్యాలయాల కాంట్రాక్ట్ టీచర్లను రెగ్యులరైజ్ చేయాలని, లేని యెడలా పెద్ద ఎత్తున ఆందోళనలు చేపడుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో జేఏసీ నాయకులు డాక్టర్ ధర్మతేజ, ఉపేందర్ తదితరులు పాల్గొన్నారు.

### ఆకట్టుకున్న నృత్య నీరాజనం



జ్యోతి ప్రజ్వలనలో పాల్గొన్న రిత్విక్ వెంకట్

**గన్‌ఫౌండ్రీ:** ప్రముఖ నృత్య సంస్థ నృత్య దర్పణ ఆధ్వర్యంలో నృత్యగురువు స్వర్గీయ అర్ధనారీశ్వర వెంకట్‌కు స్మృతి నివాళి అర్పిస్తూ శుక్రవారం రవీంద్రభారతిలో నిర్వహించిన కూచిపూడి నృత్య నీరాజనం ఆహుతులను ఆకట్టుకుంది. ఈ సందర్భంగా పలువురు వక్తలు మాట్లాడుతూ.. కూచిపూడి రంగంలో అర్ధనారీశ్వరం వెంకట్ అనేక సేవందించారని తండ్రి బాటలోనే పిల్లలు నృత్య ప్రదర్శనలు చేయడం ఎంతో అభినందనీయమన్నారు. రిత్విక్ వెంకట్, చార్మిలా వెంకట్, శ్రవంతిలా కూచిపూడి నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో ప్రముఖ సాహితీవేత్త ఆచార్య టి.గౌరిశంకర్, కలాపత్రికా సంపాదకులు మహ్మద్ రఫీ, అంజిబాబు, ప్రశాంతి తదితరులు పాల్గొన్నారు.

### మృతుడి గుర్తింపు

**మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి చెరువులో పడేసిన ఘటనలో పురోగతి**



మృతుడు, పూరన్‌సింగ్ (ఫైల్)

**పహాడీషరీఫ్:** మృతదేహాన్ని డ్రమ్ములో కుక్కి చెరువులో పడేసిన ఘటనలో పహాడీషరీఫ్ పోలీసులు పురోగతి సాధించారు. మృతుడు చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్ పరిధిలో అదృశ్యమైన పూరన్ సింగ్‌గా గుర్తించారు. ఇన్‌స్పెక్టర్ కాశీ విశ్వనాథ్ తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 25న సాయంత్రం చెరువులో మృతదేహం లభ్యం కావడంతో పరిసర పోలీస్‌స్టేషన్లలో అదృశ్యమైన కేసులను పరిశీలించారు. చాంద్రాయణగుట్ట పరిధిలోని కేసుగా పోలీసులు నిర్ధారించారు. ఉత్తర్‌ప్రదేశ్ రాష్ట్రానికి చెందిన దీన్ దయాళ్ కుమారుడు పూరన్‌సింగ్ (30) హైదరాబాద్‌కు వలస వచ్చి చాంద్రాయణగుట్టలోని బండ్లగూడ పటేల్‌నగర్‌లో పానీపూరి బండి నడుపుకొంటూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఈ నెల 22న రాత్రి 10 గంటలకు బార్కాస్‌లోని వివాహానికి హాజరవుతున్నానని ఇంట్లో చెప్పి వెళ్లి తిరిగి రాలేదు. ఫోన్ కూడా స్విచ్ఛాఫ్ రావడం.. స్థానికంగా గాలించినా ఫలితం లేకపోవడంతో అతని భార్య మమతా సింగ్ 23న రాత్రి 7 గంటలకు చాంద్రాయణగుట్ట పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేసింది. ఈ క్రమంలో మృతుడి వివరాలు తెలియరావడంతో పూరన్‌సింగ్‌కు ఉన్న వివిధాల విషయమై పోలీసులు లోతుగా ఆరా తీస్తున్నారు. ముఖ్యంగా బార్కాస్ తీసుకెళ్లిన వ్యక్తిని గుర్తించి కేసును ఛేదించేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేశారు.

# వైద్య పరికరాలు అందించడం అభినందనీయం

**రూ.9.5 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాల అందజేత**



వైద్య పరికాల వివరాలను డాక్టర్ నాగేందర్‌కు అందజేసిన హెచ్ఏఎల్ సంస్థ ప్రతినిధులు

**అఫ్జల్‌గంజ్:** పేదల పెద్దాసుపత్రి అయిన ఉస్మానియా ఆస్పత్రికి వచ్చే నిరుపేద రోగులకు మెరుగైన వైద్య సేవలందించేందుకు అవసరమైన అత్యాధునిక వైద్య పరికరాలను అందజేసేందుకు ముందుకు వచ్చిన హిందుస్థాన్ ఏరోనాటిక్స్ లిమిటెడ్ హైదరాబాద్ సంస్థను మనస్ఫూర్తిగా అభినందిస్తున్నామని ఉస్మానియా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ బి. నాగేందర్ అన్నారు. ఈ మేరకు శుక్రవారం హెచ్ఏఎల్ సంస్థ ప్రతినిధుల బృందం ఉస్మానియా ఆస్పత్రికి రూ.9.5 కోట్ల విలువైన అత్యాధునిక వైద్య పరికరాలను అందజేశారు. సర్జికల్ గ్యాస్ట్రో ఎంటరాలజీ విభాగంలో పేద రోగులకు నిర్వహించే సంక్లిష్ట కాలేయ శస్త్ర చికిత్స కోసం ఈ పరికరాలు ఎంతో తోడ్పాటు అందిస్తాయని వివరించారు. ప్లాస్టిక్ సర్జరీ, న్యూరో సర్జరీ వంటి సూపర్ స్పెషాలిటీ విభాగాల్లో ఆపరేటింగ్ మైక్రోస్కోప్‌లు, ఇతర విలువైన వైద్య పరికరాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆస్పత్రి సూపరింటెండెంట్ డాక్టర్ నాగేందర్, ఉస్మానియా మెడికల్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ శశికళారెడ్డి, వివిధ విభాగాల అధిపతులు, ఆర్ఎంఓలు హెచ్ఏఎల్ సంస్థ ప్రతినిధులకు మొక్కలను అందజేసి అభినందనలు తెలిపారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధులు అరుణ్ జె సర్కటే, వనితా, ఉమేష్ చంద్ర, మోహంతి, రామకిశోర్, సూర్యకాంత్, సుమన్ చంద్ర దేశ్‌పాండే, శివనాన సింగ్, భూపాల్, ఆస్పత్రి వివిధ విభాగాల అధిపతులు డాక్టర్ నాగప్రసాద్, డాక్టర్ మధుసూధన్, డాక్టర్ శ్రీధరాల శ్రీనివాసులు, ఆర్ఎంఓ డాక్టర్లు శేషాద్రి, సాయిశోభా, శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

## మజ్లిస్ పార్టీకి ప్రజల సంపూర్ణ మద్దతు: ఎమ్మెల్యే కౌసర్



మజ్లిస్ నాయకులతో కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్

**గోల్కొండ:** మజ్లిస్ ప్రజల వెంట ఉండే పార్టీ అని, అదే విధంగా మజ్లిస్ పార్టీకి ప్రజలు సంపూర్ణ మద్దతు ఇస్తున్నారని కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ అన్నారు. శుక్రవారం ఆయన తన కార్యాలయం వద్ద నానల్‌నగర్, టోలిచౌకి డివిజన్ల నాయకులతో సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన ఆయా డివిజన్లలో జరుగుతున్న అభివృద్ధి పనుల గురించి వారిని అడిగి తెలుసుకున్నారు. టోలిచౌకి డివిజన్‌లో బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులు ఎప్పటికప్పుడు పరిశీలించాలని ఆయన టోలిచౌకి కార్పొరేటర్ ప్రతినిధి హారూన్ ఫరాన్‌కు సూచించారు. రియాసత్ నగర్, బాల్‌రెడ్డి నగర్‌కు వరద ముంపు తప్పించడానికి బాక్స్‌టైప్ డ్రైనేజీ పనులకు నిధులు మంజూరు అయ్యాయని ఆయన అన్నారు. ఈ పనులు పూర్తయితే విరాసత్ నగర్, బాల్‌రెడ్డినగర్‌లతో పాటు నదీమ్ కాలనీకి కూడా వరదముంపు తప్పుతుందని ఆయన అన్నారు. మజ్లిస్ నాయకులు మహ్మద్ అబ్బాస్ హుస్సేన్, మహ్మద్ అజమ్ తదితరులున్నారు.

## 31న బ్రాహ్మణ సంక్షేమ సదనం ప్రారంభం



మాట్లాడుతున్న దౌలతాబాద్ వాసు దేవశర్మ

**సుల్తాన్‌బజార్:** రంగారెడ్డి జిల్లా, గోపన్‌పల్లిలో ఆరు ఎకరాల స్థలంలో రూ.12 కోట్లతో నిర్మించిన బ్రాహ్మణ సంక్షేమ సదనంను ఈనెల 31న సీఎం కేసీఆర్ ప్రారంభిస్తారని ధూప దీప నైవేద్య అర్చక సంఘం రాష్ట్ర అధ్యక్షుడు దౌలతాబాద్ వాసు దేవశర్మ అన్నారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో వారు మాట్లాడుతూ.. ప్రపంచంలోనే ఎక్కడలేని విధంగా బ్రాహ్మణ సంక్షేమ సదనం నిర్మాణం చేసినందుకు సీఎం కేసీఆర్‌కు ప్రత్యేకంగా కృతజ్ఞతలు తెలిపారు. రాష్ట్ర బ్రాహ్మణ సంక్షేమ పరిషత్ చైర్మన్ డాక్టర్ కేవీ రమణాచారి అధ్యక్షతన ఈ ప్రారంభోత్సవ కార్యక్రమం వైభవంగా జరుగుతుందన్నారు. ఈనెల 31న జరిగే కార్యక్రమానికి అర్చకులు, బ్రాహ్మణులు అధిక సంఖ్యల్లో తరలివచ్చి విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. ఈ సమావేశంలో సంఘం గ్రేటర్ హైదరాబాద్ అధ్యక్షుడు శ్రీరంగం గోపికృష్ణమాచార్యులు, రాష్ట్ర ప్రధాన కార్యదర్శులు అన్నంబొట్ల ఫణికుమార్ శర్మ, అన్నావఝల ప్రసాద్‌శర్మ, రాష్ట్ర కోశాధికారి నందనం హరికిషన్‌శర్మ పాల్గొన్నారు.

## గోషామహల్ బీఆర్ఎస్ మైనార్టీ విభాగం చైర్మన్‌గా అన్సారీ



ఇస్మాయిల్ అన్సారీకి నియామకపత్రాన్ని అందజేస్తున్న నంద కిషోర్ వ్యాస్

**నాంపల్లి:** భారత రాష్ట్ర సమితి (బీఆర్ఎస్) గోషామహల్ నియోజకవర్గం మైనార్టీ విభాగం చైర్మన్‌గా ఇస్మాయిల్ అన్సారీ అలియాస్ ఉర్దూ అన్సారీ నియమితులయ్యారు. ఈ మేరకు బీఆర్ఎస్ గోషామహల్ నియోజకవర్గం ఇన్‌చార్జి నందకిషోర్ వ్యాస్ నియామకపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా ఇస్మాయిల్ అన్సారీ మాట్లాడుతూ.. నియోజకవర్గంలో బీఆర్ఎస్ పార్టీని బలోపేతం చేయడానికి తన వంతు కృషి చేస్తానని చెప్పారు. జిల్లా అధ్యక్షుడు మాగంటి గోపినాథ్, మంత్రులు కేటీఆర్, తలసాని శ్రీనివాస్‌యాదవ్, మహ్మద్ మహమూద్ అలీ ఆదేశాలతో తనకు గోషామహల్ నియోజకవర్గం బాధ్యతలు అప్పగించినందుకు సంతోషంగా ఉందన్నారు.

## నియోజకవర్గం నలుమూలలా ఉచిత విద్యనందిస్తాం



విద్యార్థులకు దరఖాస్తులను అందజేస్తున్న గడ్డం శ్రీనివాస్ యాదవ్

**అబిడ్స్:** గోషామహల్ నియోజకవర్గంలోని విద్యార్థులకు ఉచితంగా ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యను గడ్డం గంగాధర్ ఫౌండేషన్ ఆధ్వర్యంలో అందించేందుకు కృషి చేస్తున్నట్లు ఫౌండేషన్ చైర్మన్ బీఆర్ఎస్ నాయకులు గడ్డం శ్రీనివాస్ యాదవ్ పేర్కొన్నారు. శుక్రవారం ఫౌండేషన్ కార్యాలయంలో ఉచిత విద్య దరఖాస్తులను విద్యార్థులకు అందజేశారు. అనంతరం మాట్లాడుతూ.. తమ ఫౌండేషన్ ఆధ్వర్యంలో నియోజకవర్గంలోని విద్యార్థులందరికీ ఇంటర్, డిగ్రీ, పీజీ విద్యను ఉచితంగా బోధించి విద్యార్థులను ఉన్నత శిఖరాలను అధిరోహించేందుకు కృషి చేస్తానన్నారు. విద్యార్థులు పైస్థాయిలో వెళ్లేందుకు తాను విశేషంగా ముందుండి వారికి అందుబాటులో ఉంటానన్నారు.

## ఉత్సవాలకు ముందే అభివృద్ధి పనులు



సమావేశానికి హాజరైన ప్రతినిధుల బృందం

**చార్మినార్:** ఈసారి జరిగే ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాల ప్రారంభానికి ముందే పాతబస్తీలోని అన్ని ఆలయాల వద్ద అవసరమైన అన్ని అభివృద్ధి కార్యక్రమాలను నిర్వహించాలని భాగ్యనగర్ మహంకాళి జాతర బోనాల ఉత్సవాల ఉమ్మడి ఆలయాల ఊరేగింపు కమిటీ ప్రతినిధులు మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ దృష్టికి తీసుకొచ్చారు. బోనాల జాతర ఉత్సవాల నిర్వాహణ, ఏర్పాట్లు, ఆలయాల వద్ద చేపట్టాల్సిన అభివృద్ధి కార్యక్రమాలపై శుక్రవారం బేగంపేట్‌లోని హరిత టూరిస్ట్ ప్లాజాలో జరిగిన ఉన్నతాధికారుల సమీక్షా సమావేశానికి పాతబస్తీ నుంచి ప్రతినిధుల బృందం హాజరయ్యారు. మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్ అధ్యక్షతన జరిగిన ఈ సమీక్షా సమావేశంలో పాల్గొన్న పాతబస్తీ ప్రతినిధులు ఆలె భాస్కర్ రాజ్, గాజుల అంజయ్య, రాకేశ్ తివారీ, ప్యారసాని వెంకటేశ్, అనంతోజు హన్స్‌రాజ్, అరవింద్ కుమార్ గౌడ్ తదితరులు అభివృద్ధి పనులపై మంత్రి తలసాని శ్రీనివాస్‌యాదవ్‌కు వివరించారు. వెంటనే స్పందించిన మంత్రి ఆషాఢమాసం బోనాల జాతర ఉత్సవాలకు ప్రారంభానికి ముందే అభివృద్ధి పనులు ప్రారంభమై పూర్తి అవుతాయన్నారు. దీనికి పాతబస్తీ ప్రతినిధుల బృందం మంత్రికి ధన్యవాదాలు తెలియజేశారు.

## అక్రమంగా గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న ముగ్గురి అరెస్టు

**జియాగూడ:** అక్రమంగా ధూల్‌పేట్‌లో గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్న ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి 119 సిలిండర్లను స్వాధీనం చేసుకున్న ఘటన మంగళ్‌హాట్ పోలీస్‌స్టేషన్ పరిధిలో శుక్రవారం వెలుగు చూసింది. ఇన్‌స్పెక్టర్ రవి తెలిపిన వివరాల ప్రకారం.. ధూల్‌పేట్‌లోని టక్కెర్‌వాడి ప్రాంతంలో అదే ప్రాంతానికి చెందిన బిదానియా రవి(42), మకాడియా సునిల్‌కుమార్(52), బిదానియా రాకేష్ సింగ్(39) వీరంతా కొంతకాలంగా ఇళ్ల మధ్యనే డొమెస్టిక్, కమర్షియల్ సిలిండర్ల నుంచి చిన్న సిలిండర్లకు గ్యాస్ రీఫిల్లింగ్ చేస్తున్నారు. సమాచారం అందుకున్న పోలీసులు ఘటన స్థలానికి చేరుకుని ఈ ముగ్గురిని అదుపులోకి తీసుకుని వారి వద్ద నుంచి డొమెస్టిక్ సిలిండర్లు 15, కమర్షియల్ సిలిండర్లు 26, మినీ సిలిండర్లు 78, రీఫిల్లర్స్ 5, వెయిట్ మిషిన్‌ను స్వాధీనం చేసుకుని వీటిని పౌర సరఫరాకు అప్పగించి తదుపరి విచారణ చేపట్టారు.

## సత్కారం



భగీరథ, అల్లాడి రామకృష్ణను సత్కరిస్తున్న దృశ్యం

**నాంపల్లి:** కిన్నెర ఆర్ట్ థియేటర్స్–నృత్య కిన్నెర సంస్థల సంయుక్తాధ్వర్యంలో ఏపీ పూర్వ ముఖ్యమంత్రి, నటరత్న డాక్టర్ ఎన్టీఆర్ శత జయంతి మహోత్సవాల ముగింపు సందర్భంగా డాక్టర్ ఎన్టీఆర్ జీవిత చరిత్ర రచయితలైన ప్రముఖ జర్నలిస్టు భగీరథ, ప్రముఖ రచయిత అల్లాడ రామకృష్ణకు సత్కారం జరిగింది. ఈ సత్కార సభను శుక్రవారం రాత్రి తెలుగు వర్సిటీలోని ఎన్టీఆర్ కళా మందిరంలో నిర్వహించారు. డైరెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ తెలంగాణ రాజగోపాలరావు అధ్యక్షతన జరిగిన సభకు ముఖ్యఅతిథిగా తెలంగాణ రాష్ట్ర ఇరిగేషన్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ చైర్మన్ డాక్టర్ ఎస్.వేణుగోపాలాచారి హాజరయ్యారు. ఈ సందర్భంగా భగీరథ, అల్లాడ రామకృష్ణను ఘనంగా సత్కరించారు. ఈ కార్యక్రమంలో కిన్నెర కార్యదర్శి మద్దాళి రఘురామ్ పాల్గొన్నారు. సభా ప్రారంభంలో డాక్టర్ ఎన్టీఆర్ సినీ సంగీత విభావరి అలరించింది.

## సీఎం కేసీఆర్ బీసీ పక్షపాతి

**గోల్కొండ:** సీఎం కేసీఆర్ బీసీ పక్షపాతి అని తెలంగాణ ప్రాంత పద్మశాలి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు అంబటి శ్రీనివాస్ అన్నారు. పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణానికి సీఎం కేసీఆర్ రెండున్నర ఎకరాలు భూమి కేటాయించడమే కాకుండా భవన నిర్మాణానికి రూ.5 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. నేడు పద్మశాలి ఆత్మగౌరవ భవన నిర్మాణ పనులకు పద్మశాలి సోదరులు గ్రామ సంఘాల కార్యవర్గ సభ్యులు, కులబంధువులు భారీ ఎత్తున తరలిరావాలని ఆయన కోరారు.

## సమస్యల పరిష్కారంలో అధికారులు విఫలం

**గోల్కొండ:** ప్రజల సమస్యలు ఎక్కడివక్కడే ఉంటున్నాయని బీజేపీ నాయకులు దేవర శ్రీనివాస్, దేవర వంశీ అన్నారు. శుక్రవారం బీజేపీ వారు ప్రజా సమస్యలపై పోరాటం కార్యక్రమంలో భాగంగా గుడిమల్కాపూర్ డివిజన్‌లోని పలు బస్తీల్లో పర్యటించారు. వారు ఇంటింటికీ తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకున్నారు. గుడిమల్కాపూర్ కార్పొరేటర్ దివంగత దేవర కరుణాకర్ మృతితో డివిజన్‌లో సమస్యలు పేరుకుపోతున్నాయని, అధికారులు సైతం సమస్యలను పట్టించుకోవడం ఈ సందర్భంగా వారు అన్నారు. ప్రభుత్వం ప్రజలకు సౌకర్యాలు కల్పించడంలో పూర్తిగా విఫలమవుతుందని, స్థానికంగా సరైన పాలన అందించలేని బీఆర్ఎస్ ప్రభుత్వం తమది జాతీయ పార్టీ అంటూ గొప్పలు చెప్పుకోవడం విడ్డూరమన్నారు. తమ బస్తీలో తాగునీటి కొరత తీవ్రంగా ఉందని, మల్లికార్జున్‌నగర్ వాసులు ఫిర్యాదు చేశారు.


## గోల్కొండ ప్రధాన ఖాజీగా అలీమొద్దీన్



ఖాజీ అలీమొద్దీన్‌ను అభినందిస్తున్న ఎమ్మెల్యే

**గోల్కొండ:** గోల్కొండ జోన్ ప్రధాన ఖాజీగా ఖాజీ అలీమొద్దీన్ నియమితులయ్యారు. ఈ మేరకు శుక్రవారం ఆయన టోలిచౌకి మేరాజ్ కాలనీలోని ప్రధాన ఖాజీ కార్యాలయంలో పదవి బాధ్యతలు స్వీకరించారు. ఈ సందర్భంగా కార్వాన్ ఎమ్మెల్యే కౌసర్ మొహియుద్దీన్ ఆయనను శాలువా కప్పి పూలమాలలు వేసి అభినందించారు.

## వ్యక్తి అదృశ్యం



మొగిలయ్య

**గోల్కొండ:** తన సోదరుడితో కలిసి వైద్య పరీక్షలకు నగరానికి వచ్చిన ఓ వ్యక్తి అదృశ్యమయ్యాడు. ఈ ఘటన శుక్రవారం లంగర్‌హౌస్ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటుచేసుకుంది. లంగర్‌హౌస్ ఎస్సై రాఘవేంద్రస్వామి తెలిపిన వివరాల ప్రకారం.. ఈనెల 20న మహబూబ్‌నగర్ జిల్లా నవాబ్‌పేట్ మండలం కోమల్ గ్రామానికి చెందిన మల్లేష్ తన సోదరుడు మొగిలయ్య (35)కు వైద్య పరీక్షల నిమిత్తం నానల్‌నగర్‌లోని అలివ్ ఆస్పత్రికి వచ్చాడు. వైద్య పరీక్షల అనంతరం సోదరులు ఇద్దరు ఆస్పత్రి బయటకు వచ్చారు. ఆస్పత్రి వారు ఇచ్చిన ఫైల్ లోపలే ఉందని మరిచిపోయానని జె. మల్లేష్ తన సోదరుడు మొగిలయ్యను ఆస్పత్రి బయటనే ఉండమని చెప్పి బయటకు వెళ్లాడు. ఫైల్ తీసుకుని బయటకు వచ్చాడు. కాగా అక్కడ తన సోదరుడు మొగిలయ్య కానరాలేదు. దీంతో అతడు ఆస్పత్రి దాని పరిసరాల్లో వెతికినా కూడా మొగలయ్య జాడ తెలియరాలేదు. బంధువుల వద్ద కూడా, తెలిసిన వద్ద కూడా ఆచూకీ లభ్యం కావడం లేదు. దీంతో మల్లేష్ లంగర్‌హౌస్ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. కేసు నమోదు చేసుకున్న పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

## గవర్నర్ కార్యక్రమంలో విద్యుత్ సరఫరాకు అంతరాయం

**చార్మినార్:** సాలార్‌జంగ్ మ్యూజియంలో జరిగిన ఖేలో భారత్.. జీతో భాగ్యనగర్ స్పోర్ట్స్ ఫెస్టివల్ బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమం సందర్భంగా అరగంట పాటు విద్యుత్ సరఫరాలో అంతరాయం జరిగింది. గవర్నర్ ముఖ్య అతిథిగా పాల్గొన్న బహుమతుల ప్రదానోత్సవ కార్యక్రమంలో విద్యుత్ సరఫరాలో అంతరాయం జరగడం విద్యుత్ అధికారుల నిర్లక్ష్యానికి నిదర్శనమని బీజేపీ రాష్ట్ర మాజీ అధికార ప్రతినిధి మీర్ ఫిరాసత్ అలీ బాక్రీ ఆగ్రహం వ్యక్తం చేశారు. గవర్నర్‌తో పాటు కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డి, రాజ్యసభ సభ్యుడు డాక్టర్ కె.లక్ష్మణ్‌తో పాటు పలువురు అధికార, అనధికార ప్రముఖులు పాల్గొన్న ఈ కార్యక్రమం సందర్భంగా సరైనది కాదన్నారు. ఫిర్యాదు చేసినప్పటికీ నిర్లక్ష్యంగా వ్యవహరించిన సంబంధిత విద్యుత్ అధికారులపై తగిన చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలి



పనులు ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే రాజాసింగ్, కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్

**అబిడ్స్:** అభివృద్ధి పనుల్లో నాణ్యత పాటించాలని గోషామహల్ నియోజకవర్గం ఎమ్మెల్యే రాజాసింగ్ హెచ్చరించారు. బషీర్‌బాగ్ ఆదర్శ్‌నగర్‌లో సీసీ రోడ్ల నిర్మాణం, రాక్ గార్డెన్ పార్కు అభివృద్ధి పనులను కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్‌తో కలిసి ప్రారంభించారు. అనంతరం ఎమ్మెల్యే రాజాసింగ్ మాట్లాడుతూ.. నియోజకవర్గం నలుమూలలా అభివృద్ధి పనులు వేగవంతంగా చేపడుతున్నట్లు వివరించారు. అన్ని ప్రాంతాల్లో మౌలిక వసతుల రూపకల్పనకు అధిక ప్రాధాన్యత ఇస్తుందన్నారు. కార్పొరేటర్ డాక్టర్ సురేఖ ఓంప్రకాష్ మాట్లాడుతూ.. ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో రోడ్ల నిర్మాణాలు, డ్రైనేజీ నిర్మాణాలు, ఇతర పలు అభివృద్ధి పనులు పెద్ద ఎత్తున చేపడుతున్నట్లు తెలిపారు. ప్రజలు ఎలాంటి సమస్యలు ఉన్నా ఎమ్మెల్యే రాజాసింగ్ సహకారంతో పలుశాఖల అధికారుల దృష్టికి తీసుకువెళ్లి పరిష్కరిస్తున్నట్లు వివరించారు. ఈ కార్యక్రమంలో బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర ఉపాధ్యక్షులు భీశ్వ ఓంప్రకాష్, బీజేపీ నాయకులు ఎం.కృష్ణ, అజయ్, సుధీర్‌గుప్తా, రాజ్‌గోపాల్ తదితరులు పాల్గొన్నారు.

## అమరుల చరిత్ర భవిష్యత్ తరాలకు తెలియాలి



గన్‌పార్కు వద్ద నివాళులర్పిస్తున్న అమరవీరుల కుటుంబసభ్యులు

**నాంపల్లి:** ప్రత్యేక తెలంగాణ రాష్ట్రం కోసం ప్రాణాలను త్యాగం చేసిన అమరవీరుల పేరిట స్మృతి వనం నిర్మించడం చాలా గర్వకారణం, కానీ అందులో అమరవీరుల చరిత్ర లేకపోవడం చాలా విచారకరమని తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర కన్వీనర్ కావలి మణ్యం ఆందోళన వ్యక్తం చేశారు. అమరుల చరిత్రను స్మృతి వనంలో ఉండేలా చూడాలని, ఈ సమస్య ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లడానికి శుక్రవారం అసెంబ్లీ ఎదురుగా ఉండే గన్‌పార్కు దగ్గర సమావేశమయ్యారు. ఈ సందర్భంగా వారు అమరవీరులకు నివాళులర్పించి అమరుల స్మృతి వనంలో అమరవీరుల చరిత్రను భవిష్యత్ తరాలకు తెలియజేయాలని డిమాండ్ చేశారు. అమరుల స్మృతివనం అమరవీరుల కుటుంబాల చేతుల మీదుగానే ప్రారంభించాలని కోరారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ అమరవీరుల కుటుంబాల వేదిక రాష్ట్ర కో కన్వీనర్ శశికళ, నేతలు నాగరాజు, సురేష్, ప్రవళికరెడ్డి, మహేందర్, ఉప్పలయ నరేష్, అనీల్, పవన్ కల్యాణ్, అమరవీరుల కుటుంబసభ్యులు పాల్గొన్నారు.

## శాస్త్రీయ సంగీత కళలను నేర్పించాలి



కార్యక్రమంలో పాల్గొన్న బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు తదితరులు

**గన్‌ఫౌండ్రీ:** నేటి యువతరానికి శాస్త్రీయ సంగీత కళల పట్ల మక్కువ కల్పించాల్సిన అవసరం ఎంతగానో ఉందని తెలంగాణ రాష్ట్ర బీసీ కమిషన్ చైర్మన్ వకులాభరణం కృష్ణమోహన్‌రావు అన్నారు. శుక్రవారం రవీంద్రభారతిలో తెలంగాణ రాష్ట్ర భాషా సాంస్కృతిక శాఖ సౌజన్యంతో శ్రీనాట్య శిల్పి అకాడమి ఆధ్వర్యంలో మహానృత్యోత్సవం వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. చిన్నారులకు శాస్త్రీయ సంగీత కళలపై ఉచితంగా శిక్షణను అందించడం ఎంతో అభినందనీయమన్నారు. అనంతరం గౌతమబుద్ధ నాటకం, చిన్నారుల నృత్య ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. డాక్టర్ మధు వారణాసికి వైద్యశిల్పి అవార్డును అందజేశారు. సనత్‌నగర్ కార్పొరేటర్ కొలను లక్ష్మీరెడ్డి, నిర్వహకులు దాసోజు శ్రీనివాస్, పుష్పలత పాల్గొన్నారు.



## ఎస్‌బీఐ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను నిలిపివేయాలి



మాట్లాడుతున్న యూనియన్ జాతీయ అధ్యక్షుడు శ్రీనివాస్ తదితరులు

**సుల్తాన్‌బజార్:** కార్మిక చట్టాలకు, రాజ్యాంగానికి విరుద్ధంగా జరుగుతున్న ఎస్‌బీఐ ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బదిలీలను తక్షణమే నిలిపివేయాలని ఎస్‌బీఐ కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ జాతీయ అధ్యక్షుడు ఆకుల శ్రీనివాస్ డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం హైదర్‌గూడలోని ఎన్ఎస్ఎస్‌లో ఏర్పాటు చేసిన విలేకర్ల సమావేశంలో యూనియన్ జాతీయ ఉపాధ్యక్షుడు ఎడవెల్లి నర్సింహాతో కలిసి ఆయన మాట్లాడుతూ.. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు కనీస వేతన చట్టం అమలు చేసి పూర్తిస్థాయిలో వేతనాలు, పీఎఫ్ చెల్లించాలని డిమాండ్ చేశారు. ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు 8 గంటలకు పని విధానాన్ని కచ్చితంగా అమలు చేయాలన్నారు. 12 గంటల పని విధానం కార్మిక చట్టాలకు విరుద్ధం అని, దీన్ని వెంటనే తొలగించి ఈడీఎల్ స్కీమ్ కింద చనిపోయిన 500 మంది ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు ఎలాంటి బెనిఫిట్స్ అందలేదని, వీటిని వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. 2017లో కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి దృష్టికి ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల బాధలను తీసుకువచ్చి కేంద్ర ఆర్థిక శాఖమంత్రి నిర్మలా సీతారామన్ ద్వారా ఔట్‌సోర్సింగ్ ఉద్యోగులకు బోనస్, పీఎఫ్, ఈఎస్ఐ సౌకర్యం కల్పించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో డబ్ల్యూపీసీఈసీ మెంబర్ షేక్ సల్లాఉద్దీన్ తదితరులు పాల్గొన్నారు.

## ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన



వైద్య సిబ్బందికి అవగాహన కల్పిస్తున్న ట్రాఫిక్ ఏసీపీ శంకర్‌రాజు

**అబిడ్స్:** వాహనదారులు ట్రిపుల్ రైడింగ్ చేయడం ఎంతో ప్రమాదకరమని ట్రాఫిక్ ట్రెనింగ్ ఇనిస్టిట్యూట్ ఏసీపీ జి.శంకర్‌రాజు పేర్కొన్నారు. సాదురామ్ ఆస్పత్రిలో వైద్య సిబ్బందికి, నర్సులకు, ఇతర సిబ్బందికి అంతా ఆయన ట్రాఫిక్ నిబంధనలపై ప్రొజెక్టర్ ద్వారా ట్రాఫిక్ అవగాహన కల్పించారు. అనంతరం ఏసీపీ శంకర్‌రాజు మాట్లాడుతూ.. ప్రతిఒక్క వాహనదారుడు తూచా తప్పకుండా ట్రాఫిక్ నిబంధనలు పాటిస్తే ఎలాంటి సమస్యలు ఉత్పన్నం కావని, ఎలాంటి ప్రమాదాలు సంభవించవన్నారు. ప్రజల్లో, విద్యార్థుల్లో, పలు వైద్య శిబ్బంది ఇతర శాఖల్లో ప్రతి ఒక్కరికీ ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కల్పించేందుకు తమ టీటీఐ ఆధ్వర్యంలో అవగాహన కార్యక్రమాలు చేపడుతున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్ఐ.జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

## నేడు 'మా భగవతి కా విశాల్ జాగరణ్'

**గౌలిపురా:** లాల్‌దర్వాజా దత్తాత్రేయ ఆలయం ఎదురుగానున్న వెంకట్‌రావు మెమోరియల్ హైస్కూల్ గ్రౌండ్‌లో ఈనెల 27న మా భగవతి కా విశాల్ జాగరణ్ కార్యక్రమాన్ని నిర్వహించనున్నట్లు నిర్వాహకులు తెలిపారు. శనివారం రాత్రి 8.31 గంటలకు ఫంచ్ యువ బంధు జాగరణ సమితి ఆధ్వర్యంలో మా భగవతి విశాల్ జాగరణ్ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ఈ కార్యక్రమంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొనాలన్నారు.